

మెము రైళ్ల పునరుద్ధరణ

విశాఖ: రాజమండ్రి–విశాఖ, విశాఖ–విజయ నగరం, విశాఖ–పలాస సాధారణ మెము రైళ్లను పునరుద్ధరిస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది.



కేజీహెచ్‌లో ప్రారంభోత్సవాలు

విశాఖ: కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్, వెయిటింగ్ హాల్, కనెక్టింగ్ కారిడార్, ఏఎంసీయూ వార్డులను మంత్రి విడదల రజని ప్రారంభించారు.

మూడు చక్రాల వాహనాలు



తుమ్మపాల: విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు మంజూరు చేయడానికి ఈ నెల 7న ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సహాయ సంస్థ మేనేజర్ తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసిన వారు మాత్రమే రావాలన్నారు.

కొలువుల కోవెల

- ఉద్యోగ కల్పన కేంద్రాలుగా స్కిల్ హబ్‌లు
- మూడు నెలల శిక్షణతో ఉపాధి.. బ్యాచ్‌కు 30 మందికి అవకాశం
- ఇంటర్, అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారికి కూడా నైపుణ్య శిక్షణ



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి: విద్యార్హతలు, నైపుణ్యాన్ని బట్టి అందరికీ తగిన ఉపాధి లభించాలి.. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇంటర్, అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారికి కూడా అవకాశాలు కల్పించాలన్నది ఆశయం. ఇందుకోసం నిరుద్యోగులకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగావకాశాలను కూడా కల్పిస్తున్నారు. రాష్ట్రంలో రెండు స్కిల్ యూనివర్సిటీలు, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్కిల్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు 6 స్కిల్ హబ్‌లు మంజూరు కాగా.... ఇదివరకే నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అనకాపల్లి మండలం రేబాకలో రెండు స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశారు. ఈనెల 2వ తేదీన చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరొకటి ప్రారంభించారు. మాడుగుల, పాయకరావుపేట, యలమంచిలిలలో వారం రోజుల్లో మరో మూడు స్కిల్ హబ్‌లు ప్రారంభం కానున్నాయి.

మూడు నెలల శిక్షణ.. బ్యాచ్‌కి 30 మంది..

ఈ ఏడాది స్కిల్ హబ్‌ల ద్వారా జిల్లాలో 1,360 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. నర్సీపట్నం స్కిల్ హబ్‌లో ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రొడక్షన్ కెమిస్ట్రీ కోర్సులో శిక్షణ తీసుకున్న తొలి బ్యాచ్ 30 మందిలో 22 మందికి ఉద్యోగం లభించింది. జిల్లాలో ఉన్న ఫార్మా కంపెనీల అవసరాల ప్రకారం అత్యధిక డిమాండ్ ఉన్న ప్రొడక్షన్ కెమిస్ట్రీ కోర్సులో శిక్షణ అందిస్తున్నారు. డిగ్రీ (బీఎస్సీ) కెమిస్ట్రీ పూర్తి చేసినవారు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులు. బ్యాచ్‌కి 30 మంది వంతున మూడు నెలల శిక్షణ ఇస్తారు. అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండో స్కిల్ హబ్‌లో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సు, సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్ కోర్సుల్లో శిక్షణ కల్పిస్తారు. తొలి బ్యాచ్‌లో డొమెస్టిక్ నాన్‌వాయిస్‌లో శిక్షణ ఇస్తున్నారు. పదో తరగతి పాస్ అయిన వారు ఇందుకు అర్హులు. శిక్షణ కాలంలో ఇండస్ట్రియల్ నిపుణులతో ప్రత్యేక క్లాసలను ఏర్పాటు చేస్తారు. 30 నుంచి 40 మంది వరకు శిక్షణ కల్పిస్తారు.

స్కిల్ హబ్	కోర్సు	కాంటాక్ట్ నెంబర్	విద్యార్హత
అనకాపల్లి	డొమెస్టిక్ డేటా ఎంట్రీ	7013342667 6300793328	డిగ్రీ, డిప్లొమా
నర్సీపట్నం	ప్రొడక్షన్ కెమిస్ట్రీ	9000092227	డీఎస్సీ, ఎమ్మెస్సీ
చోడవరం	మెషీన్ ఆపరేటర్	9133203064	ఎస్ఎస్‌సీ, ఇంటర్
మాకవరపాలెం	ఎన్‌పీసీ ట్రైనింగ్	8142565416	6 నుంచి 10 వరకు

ఫార్మా కంపెనీలకు ఉపయోగపడే విధంగా...



ఫార్మా కంపెనీలకు ఉపయోగపడే విధంగా ప్రత్యేకంగా తయారు చేసిన ప్రొడక్షన్ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో 90 రోజులపాటు శిక్షణ కల్పిస్తున్నాం. ప్రధానంగా జనరల్ కెమిస్ట్రీ, ప్రొడక్షన్ కెమిస్ట్రీ, నేమ్డ్ రియాక్షన్స్ గురించి బోధిస్తాం. థియరీ కన్నా ప్రాక్టికల్స్ క్లాసులు ఎక్కువగా నిర్వహిస్తున్నాం.

– జి.నానాజీ, ట్రైనర్, నర్సీపట్నం

జిల్లాకు మంజూరైన నైపుణ్య కేంద్రాలు	6
మొదటి దశలో ప్రారంభమైనవి	3
త్వరలో అందుబాటులోకి రానున్నవి మరో	3
తొలి బ్యాచ్‌లో శిక్షణ పొంది ఉద్యోగం చేస్తున్నవారు	22 మంది



శిక్షణ తరగతి నిర్వహిస్తున్న ట్రైనర్లు

త్వరలో జిల్లా స్కిల్ కళాశాల ఏర్పాటు



ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేస్తున్నాం. స్థానికంగా ఉన్న పరిశ్రమలకు అవసరమైన మానవవనరులను అందించే విధంగా కోర్సులను సిద్ధం చేశాం. శిక్షణ పూర్తయిన తర్వాత ఆయా సంస్థలే ఉపాధి కల్పిస్తాయి. రవాణా సదుపాయం కోసం నెలకు రూ.1000 కూడా అందిస్తున్నాం. ఈనెలలో పాయకరావుపేట, యలమంచిలి, మాడుగులలో కొత్త హబ్‌లు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే మాకవరపాలెం నాక్ సెంటర్ కూడా ప్రారంభమైంది. దీని ద్వారా కూడా ఉపాధి కల్పిస్తున్నాం.

– చాముండేశ్వరరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

103 అంశాలకు ఆమోదం

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం



స్థాయీ సంఘ సమావేశంలో వివిధ అంశాలు చర్చిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శనివారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. స్థాయీ సంఘం అజెండాలో 100 అంశాలు, అనుబంధ(టేబుల్) అజెండాలో 5 అంశాలు చర్చకు వచ్చాయి. ఇందులో 103 అంశాలు ఆమోదం పొందాయి. మెకానికల్ విభాగం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పద్ధతి ద్వారా జోన్–1, 2లో ఆరు సీఎంటీ కాంపాక్టర్ సొంత వాహనాల ద్వారా చెత్త తరలించడం, జోన్–8లోని ఆరు సొంత వాహనాలు మలేరియా విభాగం నందు నిర్వహించేందుకు చర్చకు రాగా.. వాయిదా పడింది. ఈ రెండు అంశాలకు సంబంధించి పూర్తి వివరాలను తర్వాత సమావేశంలో పొందుపరచాలని సంబంధిత అధికారులను మేయర్, సభ్యులు ఆదేశించారు. పలు వార్డుల్లోని శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పన, ప్రహరీ నిర్మాణం, జీ–20 సమ్మిట్ నేపథ్యంలో ప్రధాన రహదారుల మరమ్మతులు, స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, తీర ప్రాంతంలో సుందరీకరణ పనులు, పెయింటింగ్, ట్రీ ప్లాంటేషన్, బీచ్‌రోడ్డులో పలు చోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, తదితర అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య, ఎస్ఈ వై.కృష్ణారావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఏసీపీ మహాపాత్రో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హైదరాబాద్ వెళ్లి ఏడుగురికి పింఛన్లు పంపిణీ



ఆదారి రాంబాబుకు పింఛను అందజేస్తున్న కె.జె.పురం వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన ఏడుగురు లబ్ధిదార్లకు హైదరాబాద్ వెళ్లి వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శనివారం పింఛన్లు అందజేశారు. ప్రస్తుతం అక్కడ ఉన్న ఆదారి రాంబాబు, సాలాపు రాము, కాళ్ల కమల, మళ్ల అప్పారావు, దాడి అప్పలనర్సమ్మ, పిళ్లా కోటమ్మ, మళ్ల భవానీల ఇళ్లకు వెళ్లి సచివాలయం–2 వెల్ఫేర్ అసిస్టెంట్ వేచలపు చిన్న, వలంటీర్ రాపేట ప్రసాద్ పింఛన్లు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి పెంకి శివ తెలిపారు.

సముద్ర తీరాలను పరిశీలించిన ఎస్పీ

అనకాపల్లి టౌన్: సముద్ర తీరాల్లో ఆదివారం ఉదయం భక్తులు మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించనున్న నేపథ్యంలో వివిధ తీర ప్రాంతాలను ఎస్పీ గౌతమి సాలి శనివారం పరిశీలించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, అచ్యుతాపురం మండలం పూడిమడక, రాంబిల్లి మండలం వాడపాలెం, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్రతీరాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.

పూడిమడకకు ప్రత్యేక బస్సులు

మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీరానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సుజాత పేర్కొన్నారు. నెహ్రూచౌక్ నుంచి ప్రతి 10 నిమిషాలకు బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. మొత్తం 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం రాత్రి 7 గంటల వరకు బస్సులు తిరుగుతాయన్నారు.

చిన్నికుమారి అవుట్.. చిరంజీవరావు ఇన్.!

- టీడీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని మార్చేసిన చంద్రబాబు
- డబ్బులు లేవన్న కారణంతో బీసీ మహిళ చిన్నికుమారి లక్ష్మికి షాక్
- అన్ని సామాజికవర్గాల నేతలు చేతులెత్తేయడంతో ఆదరాబాదరాగా తొలుత ప్రకటన
- డబ్బులు లేనివారికి టికెట్ ఎందుకిచ్చారంటూ నేతలపై చంద్రబాబు ఆగ్రహం
- డా.చిరంజీవిరావును అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



చిన్ని కుమారి లక్ష్మి



చిరంజీవి రావు

సాక్షి, విశాఖపట్నం: నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మరోమారు నిరూపితమైంది. ఎమ్మెల్సీ టికెట్ కేటాయించడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మహిళా నేతకు మధ్యలోనే వెన్నుపోటు పొడిచి.. వేరే వ్యక్తికి టికెట్ ఖరారు చేయడం జిల్లా టీడీపీ నాయకులను సైతం విస్మయానికి గురిచేసింది. టికెట్ కేటాయించిన మూడు నెలలకే అభ్యర్థిని మార్చేశారు. ఆదరాబాదరాగా తొలుత అభ్యర్థిని ప్రకటన చేసి.. డబ్బులు లేవన్న కారణంతో ఆమెకు మొండిచెయ్యి చూపించారు. మహిళలకు పార్టీలో గౌరవం లేదంటూ ఇటీవలే ఆ పార్టీలో ఉన్న మహిళా నేతలు బాహాటంగా చెప్పిన విషయాలు.. తాజా నిర్ణయంతో మరోసారి నిరూపితమైంది. బీసీ మహిళకు షాక్ ఇచ్చి సామాజిక వర్గ ప్రాతిపదికపై ఎంపిక చేశారు.

మార్చిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ సందడి మొదలైంది. పార్టీ పూర్తిగా పట్టుకోల్పోతున్న నేపథ్యంలో ఎన్ని కుయుక్తులైనా పన్ని.. విజయం సాధించాలని చంద్రబాబు నానా యాతన పడుతున్నారు. ఎమ్మెల్సీ టికెట్ ఎవరికి ఇవ్వాలన్న అంశంపై సుదీర్ఘ మంతనాలు, సదస్సులు నిర్వహించిన టీడీపీ.. మూడు నెలల క్రితం మహిళా నేతకు ఖరారు చేసింది. వాస్తవానికి అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్‌తో పాటు మరికొందరు కీలక నేతల్లో ఎవరైనా ఒకరికి టికెట్‌ని కేటాయించాలని భావించారు. పార్టీ పరిస్థితి ఏమాత్రం బాగోలేదని, ఈ తరుణంలో ఎన్నికల్లో నిలబడి.. డబ్బులు పోగొట్టుకోలేమంటూ దాదాపు అన్ని సామాజిక వర్గాలకు చెందిన కీలక నేతలంతా తెగేసి చెప్పారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులపై చంద్రబాబు, అచ్చెన్న, బుద్దా వెంకన్న దృష్టిసారించారు. గతంలో భీమిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ.. ప్రస్తుతం జీవీఎంసీ 2వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న గాడు చిన్నికుమారి లక్ష్మిని సంప్రదించారు. దాదాపు రూ.4 కోట్ల వరకూ ఖర్చు చేయగలమనీ.. మిగిలిన డబ్బులు పార్టీ సర్దాలని కోరడంతో టికెట్ ఖరారు చేస్తున్నట్లు బాహాటంగా ప్రకటించారు.


డబ్బులు లేవంటూ పక్కన పెట్టేశారు

ఇప్పటికే పార్టీ ఎన్నికల ఖర్చులంటూ రూ.లక్షల వరకూ సదరు అభ్యర్థి ద్వారా ఖర్చు చేయించారు. ఇటీవల టీడీపీ ముఖ్యనేతలు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొంత మొత్తం సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పార్టీ వైఖరిపై విసుగు చెందిన సదరు మహిళా అభ్యర్థి కుటుంబం.. టీడీపీ నేతల ఫోన్లు ఎత్తడం మానేశారు. డబ్బులు సర్దుబాటు చేయలేమని అధిష్టానానికి సమాచారం పంపించారు. దీనిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కోట్లయినా పెట్టగలిగిన అభ్యర్థిని చూడాలని చెబితే.. ఇలాంటి వారిని ఎందుకు ఎంపిక చేశారంటూ పార్టీ ఎన్నికల పరిశీలకులపై మండిపడ్డారు. కోట్లు ఖర్చు చేసైనా ఎమ్మెల్సీ గెలవాల్సిందేననీ, అలాంటి వారికి టికెట్ కేటాయించాలని ఆదేశించారు. దీంతో మరోసారి మదింపు నిర్వహించి రావికమతం ప్రాంతానికి చెందిన డా.వేపాడ చిరంజీవరావును ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి అంటూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. డబ్బులు లేకపోవడం వల్లనే ఆమెను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

బీసీ మహిళకు షాకిచ్చిన చంద్రబాబు

టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో గాడు కుటుంబం షాక్‌కు గురైంది. కనీసం ఒక మాట చెప్పకుండా.. టికెట్‌ని వేరేవాళ్లకు కేటాయించడాన్ని అవమానకరంగా భావిస్తున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. టీడీపీలో మహిళలకు గౌరవం లేదన్నది మరోసారి సుస్పష్టమైందని పార్టీలోని కొందరు నేతలు విమర్శిస్తుండటం గమనార్హం. ఇప్పటికే రూ.కోటిన్నర వరకూ ఖర్చు చేయించి.. ఇప్పుడిలా మోసం చేశారంటూ గాడు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీ మహిళని పార్టీ అవమానించిందంటూ జిల్లా టీడీపీ నాయకులే చెబుతున్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయం అచ్చెన్నాయుడికి తప్ప ఉత్తరాంధ్రలోని ఏ ఒక్క టీడీపీ నేతకు కూడా తెలియకపోవడం విశేషం. బీసీ వర్గాలకు వెన్నుపోటు పొడిచి.. ఉన్నత వర్గాలకు టికెట్ కేటాయించడం వెనుక చోడవరం టీడీపీ సీనియర్ నేత చక్రం తిప్పినట్లు తెలుస్తోంది.

ప్రచారంలో దూసుకుపోతున్న సీతంరాజు



ఈసారి రాజకీయపక్షాలు ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపరిచిన అభ్యర్థిగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పేరును ప్రకటించింది. ఆయన ప్రతి నియోజకవర్గంలోనూ అన్ని వర్గాల ప్రతినిధులతో భేటీ అవుతూ ప్రచారం పర్వం కొనసాగిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభ కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఖైదీలకు ఆరోగ్యశ్రీ సేవలు

జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్



యలమంచిలి సబ్ జైలులో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీఐజీ రవికిరణ్



ఉపమాక వెంకన్న ఆలయంలో డీఐజీకి స్వాగతం

యలమంచిలి: ఖైదీలలో మానసిక పరివర్తనకు కృషి చేస్తున్నామని జైళ్ల శాఖ ఆంధ్రా రీజియన్ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ పేర్కొన్నారు. జైళ్ల పర్యవేక్షణలో భాగంగా శనివారం యలమంచిలి ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఖైదీలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్య సేవలందించాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని చెప్పారు. ఖైదీలకు ఆధునిక వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ సేవలు ఉపయోగపడుతున్నాయన్నారు. ఖైదీల నుంచి బయోమెట్రిక్ ద్వారా ఐరిస్, ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తామని, వీరు విడుదలయిన తర్వాత మళ్లీ నేరాలు చేస్తే వీటి ద్వారా వారిని గుర్తించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం జైళ్లలో నూతనంగా సీసీ టీవీలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఖైదీలకు కొత్త మెను ప్రకారం పౌష్టికాహారం అందిస్తామని, సంవత్సరంలో రెండుసార్లు జైళ్లను సందర్శించి మౌలిక వసతులు, సిబ్బంది పనితీరును సమీక్షిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఖైదీలకు పెడుతున్న ఆహారాన్ని రుచి చూశారు. జైల్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు, వంటశాల, ప్లాంటేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలందించారు. ఖైదీలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. జైలు అవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట జిల్లా ఉప కారాగార అధికారి బి.కృష్ణారావు, జైలర్ రాజు, యలమంచిలి సబ్ జైల్ పర్యవేక్షణాధికారి బి.కనకరాజు, యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, పట్టణ ఎస్సై పాపినాయుడు, జైల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న సన్నిధిలో..

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ శనివారం దర్శించుకున్నారు. అర్చకులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధానార్చకులుగొట్టుముక్కల వరప్రసాద్ స్వామివారి క్షేత్రమహత్యాన్ని వివరించి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని కానుకగా అందజేశారు.

రోజూ లక్షమందికి 'ఉపాధి'



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా అడిషనల్ పీవో రోజారాణి

నాతవరం: ఉపాధి హామీ పథకంలో ఈనెల 6వ తేదీ నుంచి రోజుకు లక్షమంది కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలోని 24 మండలాల్లో రోజుకు 60 వేల మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో అమృత్ సరోవర్ పథకంలో 137 చెరువులు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 40 పైగా చెరువులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో మండువేసవిలో సైతం నీరు పుష్కలంగా ఉంటుందన్నారు. ఉగాది నాటికి జగనన్న కాలనీలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు పాల్గొన్నారు.

‘ఆలయాభివృద్ధిని రాజకీయం చేయటం తగదు’



ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: కళ్యాణపులోవలో శిథిలమైన శివలింగాన్ని శాస్త్రోక్తంగా తొలగించి ఆ స్థానంలో నూతన శివలింగాన్ని ఏర్పాటు చేయడాన్ని విమర్శించడం సిగ్గుచేటు అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ప్రతిపక్ష నాయకుల నీచపు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ నెల 18,19,20 తేదీల్లో కళ్యాణపులోవలో జరిగే మహా తిరునాళ్లను పార్టీ శ్రేణులు, అధికారులు విజయవంతం చేయాలని కరణం ధర్మశ్రీ అన్నారు. తిరునాళ్ల గోడపత్రికను ఆవిష్కరించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కీలక సంస్కరణలు

- 22ఏ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- విశాఖలో ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి ధర్మాన, కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

కొమ్మాది: రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో శనివారం ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల సదస్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రెవెన్యూ సమస్యలు, ఇతర విషయాలు చర్చించేందుకు ఇప్పటికే తిరుపతి, విజయవాడలో ఈ తరహా సదస్సులు నిర్వహించామన్నారు. ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్న భూ రీసర్వేను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిలో భూమి ప్రధాన వనరన్నారు. ఒకప్పుడు వ్యవసాయానికి అనుగుణంగానే భూమి అనే మాట ఉండేదని.. క్రమ క్రమంగా రాష్ట్రం, దేశంలో సర్వతోముఖాభివద్ధికి ఉపయోగపడే ప్రధాన వనరుగా మారిందన్నారు. అలాంటి భూమిని యజమాన్యం చేస్తున్న రెవెన్యూ శాఖ.. ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలు చేపడుతోందని వివరించారు. భూమి వినియోగం పెరిగితే రాష్ట్ర జీడీపీకి దోహదపడుతుందన్నారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని మంత్రి ధర్మాన స్పష్టం చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో సీసీఎల్‌ఏ కమిషనర్ సాయిప్రసాద్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బి.రామకృష్ణ, సీసీఎల్‌ఏ అదనపు కమిషనర్ ఇంతియాజ్‌తో పాటు విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి జిల్లా, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డీఆర్వోలు, తహసీల్దార్లు ఇతర సీనియర్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభోత్సవానికి ముందు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు మంత్రి ధర్మాన హాజరయ్యారు. రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి వివిధ ఫొటోలకు సంబంధించిన అంశాల గురించి మంత్రికి వివరించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబసభ్యుల్లో 135 మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి చేతులమీదుగా అందించారు.

పండగల్లో క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గ్రామీణ పండగల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో ఉమామహేశ్వరీదేవి కల్యాణ (తీర్థ) మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, స్థానిక మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి, సింహాచలంనాయుడు తదితరులతో కలిసి కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. దేవితల్లిని, కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని బూడి పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు



సంఘటనా స్థలంలో భార్యాభర్తలు



ప్రమాదంలో మృతి చెందిన సన్యాసినాయుడు

కె.కోటపాడు: రోడ్డు ప్రమాదానికి గురై భర్త మరణించగా.. భార్య గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనమిది. జోగన్నపాలేనికి చెందిన భార్యాభర్తలు బండారు సన్యాసినాయుడు, రామలక్ష్మి బైక్‌పై విశాఖపట్నం బంధువుల ఇంటికి శనివారం బయలుదేరారు. బైక్‌పై చంద్రయ్యపేట వద్దకు చేరుకునే సమయానికి సబ్బవరం గుల్లేపల్లి నుండి కె.కోటపాడు వైపు అతివేగంతో వస్తున్న ఆటో సన్యాసినాయుడు, రామలక్ష్మి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలు దూరంగా ఎగిరి పడ్డారు. ఘటనలో దంపతులకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భర్త సన్యాసినాయుడు (44) మృతి చెందాడు. భార్య రామలక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాద ఘటనపై కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్‌కు మృతుడు సన్యాసినాయుడు మేనల్లుడు భాస్కరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ విచారిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి శవాన్ని బంధువులకు అప్పగించారు. బైక్‌ను ఢీకొన్న ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి గాయాలై సబ్బవరం ఆసుపత్రిలో చికిత్స పొంది మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. సాయంత్రానికి ఇంటికి తిరిగి వస్తాడనుకున్న తండ్రి శవమై కనిపించటంతో సన్యాసినాయుడు కుమారుడు కిశోర్, కుమార్తె పావని రోదించడంతో వీరిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

క్లుప్తంగా

పండితులకు సత్కారం



పండితులను సత్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ 98వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో శనివారం పండితులను ఆలయ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు స్వామివారికి పుష్పాంజలి సేవ అర్చకులు బేబి, కమల నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వర రావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



కశింకోటలో స్వాభిమాన్‌పై అవగాహన ర్యాలీ

కశింకోట: కశింకోటలో శనివారం స్వాభిమాన్ (ఆత్మ గౌరవం) కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్యం, సామాజిక సమస్యలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎస్. రమేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు రక్త హీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

అనకాపల్లిటౌన్: జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి శనివారం పేర్కొన్నారు. ఉడ్‌పేట, చదువులవారివీధి, మళ్లవీధి, కాశీవిశ్వేశ్వర ఆలయం ప్రాంతం, వేల్పులవీధి, చవితిన వీధి, నర్సింగరావుపేట, జీ.వి.కోటేశ్వరరావు వీధి, గూడ్స్‌షెడ్, జార్జిక్లబ్ ప్రాంతం, శాఖవీధి, నాగవంశంవీధి, భీమునిగుమ్మం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 8,721 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,800	4,200
మొదటి రకం	3,330	3,680
రెండో రకం	3,120	3,460
మూడో రకం	2,880	3,100

అనకాపల్లి సినిమాలు

మైఖేల్	- రాజా
బుట్ట బొమ్మ	- సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	- సత్యనారాయణస్క్రీన్-2
రైటర్ పద్మభూషణ్	- షిర్డిసాయి
పఠాన్	- పర్తిసాయి
వీరసింహారెడ్డి	- వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 10 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 443 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష



గడప గడపకు కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో నియామకపత్రాలతో అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్లు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలో 83వవార్డు పరిధిలో చాకలిపేట, ఆమంచివారివీధి, శాఖవీధి, అగ్నిమాపక కార్యాలయం ప్రాంతాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు లక్షలాదిమంది ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజాప్రతినిధులు గడప గడపకు ధైర్యంతో వెళ్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంతకుముందు చాకలిపేట కనక దుర్గమ్మ, కాశీవిశ్వేశ్వరస్వామిలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇస్త్రీ చేస్తున్న వ్యక్తి సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. ఓ వృద్ధురాలికి నేనున్నాను... అంటూ మనోధైర్యం చెబుతూ ముందుకు సాగారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తెన్నులను లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు. వేల్పులవీధి వైఎస్సార్‌సీపీ నేతలు బొండా శంకర రావు, ఉగ్గిన అప్పారావు, గొర్లి చిన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మిలను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత, వైద్యుడు రామ్మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నేతలు కలగ గున్నయ్యనాయుడు, పొలమరశెట్టి మురళి, గైపూరి రాజు, మూనురు శ్రీను, ఎ.వి. రత్నకుమారి, పెతకంశెట్టి జగన్‌మోహన్‌రావు, మలసాల కిశోర్, వాసు, కొండూరు రవీంద్ర, బుద్ధ రాజు, మనోజ్, నూకరాజు, కన్నారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు మరింత విస్తృతం

స్థానిక రింగ్‌రోడ్డు పార్టీకార్యాలయంలో కశింకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తగా నియమితులైన 9మంది హెల్పర్స్ అండ్ వర్కర్లకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా పోస్టులకు గతంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని, ఏడుగురు వర్కర్లు, ఇద్దరు హెల్పర్ పోస్టులకు భర్తీ చేసినట్టు చెప్పారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారిణి ఉషారాణి, కశింకోట సీడీపీవో కె.శ్రీలత, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కశింకోట, అనకాపల్లి ఎంపీపీలు కలగ లక్ష్మి, గొర్లి సూరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, కశింకోట అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుచరిత, వంశీప్రియ, ఉమ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఇళ్ల కార్యక్రమం



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : హౌసింగ్ డే కు జగనన్న ఇళ్లతో పరమార్థం దొరికిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో గోపాలపురం సచివాలయ పరిధిలో గల వి.ఆర్.పేటలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు గూడు కల్పించిందని పేర్కొన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులందరూ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో ధర్మారావు, హౌసింగ్ డీఈ మధురవాణి, హౌసింగ్ ఏఈ యుగంధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, మండల ఏఈ కుమార్‌రాజా, రెవెన్యూ అధికారులు రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రగతి భవనాలు పరిశీలించిన ఎంపీడీవో



ఉగ్గినపాలెంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ప్రగతి భవనాలను ఎంపీడీవో కొంకి అప్పారావు శనివారం పరిశీలించారు. రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాల భవనాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రూ.5 లక్షలతో నిర్మించిన సంపద కేంద్రాన్ని పరిశీలించి దీన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పథకంలో చెరువును రూ.5 లక్షలతో లోతు చేయడానికి ప్రతిపాదించిన పనులను పరిశీలించారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు పక్క చెరువుల అభివృద్ధికి చర్యలు



తాళ్లపాలెం చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట: మండలంలో ప్రధాన రోడ్డు పక్కనున్న చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలో ప్రధాన రోడ్డు పక్కన తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో ఉన్న చెరువులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో రోడ్డు పక్కనున్న చెరువులను లోతు చేసి, చుట్టూ చెత్తా చెదారాలను తొలగించి శుభ్ర పరుస్తామన్నారు. అనంతరం చెరువుల ఆధునికీకరణకు రక్షణ గట్ల చుట్టూ మెటల్‌గాని, సిమెంట్‌తోగాని రోడ్లు వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు చుట్టూ పచ్చదనం కోసం మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు అయ్యే వ్యయంపై ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, తాళ్లపాలెం-1,2 ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, ఇందల హేమలత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బత్తుల పరిమలాదేవి పాల్గొన్నారు.

సందడిగా మొదలైన మాఘ మాస జాతర



పూడిమడక తీర ప్రాంత జాతరలో స్టాల్స్, పలు ఆట వస్తువులు



విద్యుత్ సెట్టింగ్‌లు

అచ్యుతాపురం(అనకాపల్లి): మాఘ మాస జాతర ఘనంగా మొదలైంది. అనకాపల్లి జిల్లాలోని అతి పెద్ద తీర ప్రాంతమైన పూడిమడకలో జాతర మహోత్సవం సందడిగా మొదలైంది. రాత్రంతా జాగారం ఉండి, తెల్లవారు జాము నుంచి స్నానాలు ఆచరించనున్నారు. హైస్కూల్ జంక్షన్ నుంచి విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. పలు స్టాల్స్‌తో తీర ప్రాంతం ఉత్సాహ వాతావరణంలో కనిపించింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి సముద్రపు స్నానాలు ఆచరించి, జగన్నాథ స్వామి వారిని దర్శించుకోనున్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ



కుంచంగి సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలోని కుంచంగి గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.ధర్మారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇందులో ఏఈ కుమార్ రాజా, సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి,నాగేశ్వరావు, కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం అత్యంత శక్తివంతమైంది



ప్రవచనాలు చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

అనకాపల్లిటౌన్: మాఘపౌర్ణమి ధ్యానం అత్యంత శక్తివంతమైందని కైలాసపురి ట్రస్టు చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్త క్షేత్రంలో మూడురోజులుగా జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని కోరారు. ఏకాగ్రతతో ధ్యానం చేయడం ద్వారా సర్వరోగ నివారణకు ఉపకరిస్తుందన్నారు. త్రిశక్తి మహిళా ధ్యాన్య మహాచక్ర పిరమిడ్ మాస్టర్లు ఆధ్వర్యంలో ధ్యాన సందేశాలతోపాటు నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రాజు, జిల్లా నలుమూలల నుంచి 300 మందిపైకి భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పత్రాల ఆవిష్కరణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటాలే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భవానీ, క్రైట్స్, రవీంద్ర పాఠశాలల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో ఈ పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. దివ్యాంగుల పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమణ, గొర్లె తరుణ్, సోమునాయుడు, బాలాజీ, బాబ్జీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాభిమాన్ అవగాహన ర్యాలీ



తేగాడలో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ర్యాలీ

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని, ఎ.ఎస్.పేట హైస్కూళ్లు, తేగాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు, మహిళలు ఆయా గ్రామాల్లో స్వాభిమాన్ (ఆత్మ గౌరవం) కార్యక్రమంపై అవగాహన కలిగిస్తూ శనివారం ర్యాలీలు నిర్వహించారు. బాల్య వివాహాలు మానుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవాలని ప్రజలను కోరారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ,ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, మహిళలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఏడీసీ చంద్రమోహన్



చంద్రమోహన్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న జయవీర్, బుద్ధ మహాలక్ష్మినగేష్

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారిని శనివారం దేవదాయశాఖ ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్(ఏడీసీ)చంద్రమోహన్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చంద్రమోహన్ దంపతులకు వైఎస్సార్‌సీపీ యువ నేత దాడి జయవీర్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌లు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య ఉత్పత్తులు



అచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ

కశింకోట: అచ్చెర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కలిగిస్తూ శనివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆరోగ్య ఉత్పత్తులను అందించే ప్రకృతి వ్యవసాయం సాగు చేపట్టాలని, రుతుపవనాలు రాకకు ముందు పంట భూములు సారవంతం చేయడానికి 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు నాటుకొని సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎం.మహేశ్వరరావు, విహెచ్ఏ కిషోర్, స్కూలు హెచ్ఎం శ్రీనివాసరావు, స్వయం సహాయక సంఘాల వీవోఏ కె.నాగమణి, ఉపాధి పథకం ఫీల్డు అసిస్టెంట్ సత్యవతి, ప్రకృతి వ్యవసాయం ట్రైనర్ ఎం.టి.వర్మ, ఎంఎస్ఆర్‌పి డి.రమణ, పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా..

- రాజీ చేసేందుకు కృషి చేయాలి
- కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి
- 11న జాతీయ లోక్ అదాలత్
- అదనపు జిల్లా జడ్జి ఫణికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి ఫణికుమార్

అనకాపల్లి టౌన్: స్థానిక న్యాయసముదాయంలో ఈనెల 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఫణికుమార్ చెప్పారు. కోర్టు ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గల వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చేలా కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్లా పరవిజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయచందర్, నిరుపమ, ప్రదీప, డీఎస్పీలు మళ్ల మహేష్, పి.శ్రీనివాసరావు, సీఐ దాడి మోహనరావు, పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

వాణీజయరాం మృతి సినీ పరిశ్రమకు తీరనిలోటు

అనకాపల్లి టౌన్ : ప్రముఖ నేపథ్య సినీగాయని వాణీజయరాం మృతి సినీలోకానికి తీరనిలోటుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అభివర్ణించారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రాలలో జయరాం ఎన్నో పాటలు పాడారని గుర్తు చేసుకున్నారు. మూడేళ్లగా జాతీయస్థాయిలో ఉత్తమ గాయనిగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు ఆమె పొందారని పేర్కొన్నారు. ఇటీవల జనవరి 26వతేదీన కేంద్రం జయరాంకు పద్మభూషణ్ బిరుదు ప్రకటించిందని తెలిపారు. డైమండ్ హిట్స్ తరపున ఆయన ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

7న నల్లమారమ్మ పండగ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లిటౌన్: మండలంలో రామాపురం గ్రామంలో ఈనెల 7న నల్లమారమ్మ పండగను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులకు బీసీ సాధికార సమితి గవర రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర సూచించారు. అంతకుముందు ఆలయ ఆవరణలో శనివారం పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీటీసీ కోన శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు పెంట కృష్ణ, జ్యోతుల గణేష్, చక్కా రాంబాబు, ఐతా రాము, కొవ్వాడ వాసు, పూడి సతీష్ పాల్గొన్నారు.

సూపర్‌స్పెషాలిటీ క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకు వినతి



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో సూపర్‌స్పెషాలిటీ క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు శనివారం నేతలు వినతిపత్రం అందజేశారు. క్యాన్సర్ రోగుల పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చిన్నియాదవ్, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు, మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవింద, బొడ్డేడ అప్పారావు పాల్గొన్నారు.

జోరుగా రోడ్డు వెడల్పు పనులు



పంచాయతీలో రోడ్డు వెడల్పు పనులు

కశింకోట: కశింకోటలోని పంచాయతీ ప్రధాన రోడ్డును వెడల్పు చేసే పనిని చేపట్టారు. కశింకోట జాతీయ రహదారి నుంచి వెదురుపర్తి వెళ్లే రోడ్డును సుమారు రూ.కోటి 80తో పునర్నిర్మించి తారు రోడ్డు వేస్తున్నారు. దీనిలో భాగంగా పంచాయతీ ప్రధాన రహదారిని రెండు వైపులా మెటల్ వేసి వెడల్పు చేయడానికి మట్టి తొలగించే పనులను నిర్వహిస్తున్నారు. దీని అనంతరం మెటల్ వేసి దానిపై తారు వేయనున్నారు. దీంతో రోడ్డు వెడల్పు కావడంతోపాటు గోతులు పూడుకుపోయి రాకపోకలకు సౌకర్యవంతం కానుంది.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు



కాళ్లపల్లి నాగేష్ (ఫైల్)

కశింకోట: కశింకోటలోని కస్పావీధికి చెందిన ఆటో డ్రైవర్ కాళ్లపల్లి నాగేష్(29) కనిపించకపోవడంపై కేసు నమోదు చేసినట్టు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు శనివారం రాత్రి తెలిపారు. గత నెల 24న ఆటోతోపాటు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెదికినా ఆచూకీ లేకపోవడంతో భార్య నాగ నీలజ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

అనకాపల్లి టౌన్: కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి చిరంజీవి (25) రైలు ఢీకొని శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారాం శనివారం చెప్పారు. తన బైక్ మరమ్మతుల నిమిత్తం అనకాపల్లి వచ్చిన చిరంజీవి శంకరం రైలు పట్టాలపైకి బహిర్భూమికెళ్లి రైలు ఢీకొని మృతి చెందాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నేడు చందనం అలంకరణలో నృసింహస్వామి

అనకాపల్లి టౌన్ : పట్టణంలో గవరపాలెం శ్రీవరహాలక్ష్మీ నృసింహస్వామి వారు ఆలయంలో స్వామివారు ఆదివారం చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ వ్యవస్థాపకుడు మళ్ల దాసుడు, మళ్ల రామచంద్రావు శనివారం పేర్కొన్నారు. మాఘపౌర్ణమి పురస్కరించుకొని పంచామృతాభిషేకం, దీపాలంకరణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.